పాడి రైతులకు వరం.. మినీ గోకులం

పశువులు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తుల ఆహ్వానం

యలమంచిలి: పాడి పరిశ్రమను ప్రోత్సాహించేందుకు మినీ గోకులాల పేరిట పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 70 నుంచి 90 శాతం వరకు రాయితీ ఇస్తుంది. 90 శాతం రాయితీతో పశువుల షెడ్ల నిర్మాణానికి, 70 శాతం రాయితీతో గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మాణానికి అనుమతి ఇస్తున్నారు. ఈ పథకంలో పశువుల షెడ్డు యూనిట్‌కు గరిష్టంగా రూ.2,07,000 నుంచి కనిష్టంగా రూ. 1,03,500 వరకు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు గరిష్టంగా రూ.1,61,000 నుంచి కనిష్టంగా రూ. 26,100 వరకు లబ్ధి చేకూరనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ పథకం అమలు కానుంది. గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగుపరచేందుకు ఈ పథకం దోహదపడుతుంది.


పశువుల షెడ్డు

పశువుల షెడ్ల నిర్మాణానికి (రూ.ల్లో)

షెడ్డు	యూనిట్ వ్యయం (రూ.)	ఉపాధి నిధులు (90%) (రూ.)	రైతువాటా (10%) (రూ.)
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 పశువులు	2,30,000	2,07,500	23,000

గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు

షెడ్డు	యూనిట్‌వ్యయం (రూ.)	ఉపాధి నిధులు(70%) (రూ.)	రైతువాటా(30%) (రూ.)
20 గొర్రెలు/మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు/మేకలు	2,30,000	1,61,000	69,00
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

అర్హతలు ఇవే

- ఎస్సీ, ఎస్టీ, వలస డి-నోటిఫైడ్ తెగల వారు దారిద్ర్య రేఖ దిగువ ఉన్న వారు
- మహిళా యజమాని/అంగ వైకల్య యజమాని కుటుంబాలు
- భూ సంస్కరణ/పీఎం ఏవైజీ లబ్ధిదారులు
- అటవీ హక్కుల చట్టం-2006 లబ్ధిదారులు
- చిన్న / సన్నకారు రైతులు

జత చేయాల్సిన పత్రాలు

- అప్లికేషన్ ఫారమ్, ఆధార్ కార్డు
- ఉపాధి హామీ జాబ్ కార్డు
- స్థలం హక్కు పత్రం, బ్యాంక్ పాస్ బుక్

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అర్హత ఉన్న పాడి రైతులంతా మినీ గోకులం పథకాన్ని వినియోగించుకోవాలి. లబ్ధిదారులు పూర్తి వివరాల కోసం దగ్గరలోని పశు వైద్యశాలలో గానీ, రైతు సేవా కేంద్రంలో గానీ సంప్రదించాలి. ఎలా దరఖాస్తు చేసుకోవాలో సిబ్బంది వివరిస్తారు.

– డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు, పాలకొల్లు ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకుడు

రాయల్ క్లబ్ జాతీయ అధ్యక్షుడిగా చినిమిల్లి


చినిమిల్లిని అభినందిస్తున్న అతిథులు

నరసాపురం: రాయల్‌క్లబ్ జాతీయ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం స్థానిక తెలగ కల్యాణమండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతీయ కమిటీకి ఎన్నికైన నరసాపురానికి చెందిన అందే రామసతీష్, అందే రంగారావు, యర్రంశెట్టి ఫణికర్‌లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్సీ వంక రవీంద్ర, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, డాక్టర్ సీహెచ్ బాబ్జిలు ముఖ్య అతిథులుగా హాజరై డాక్టర్ చినిమిల్లి రాయల్‌క్లబ్ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ జాతీయ అధ్యక్షుడు సుంకర కృష్ణ, కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, జీవీకే రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామంలోని సమస్యలపై దృష్టి సారించాలి


ఎంపీడీఓ త్రిశూల పాణితో మహిళా పోలీసులు

మొగల్తూరు: గ్రామంలోని ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి ఆదేశించారు. మొగల్తూరు ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన త్రిశూల పాణి ని మండలంలోని మహిళా పోలీసులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈసందర్భంగా వారితో సమావేశమైన ఎంపీడీవో గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కె.సుధారాణి, ఎం.భార్గవి, టి.శిరీష, పద్మినీ దేవి, డి.మోహని తదితరులు పాల్గొన్నారు.

బాల సుబ్రహ్మణ్యం పేరు పెట్టడం హర్షణీయం


సారిక రామచంద్రరావు

పాలకొల్లు సెంట్రల్: తన పాటతో, మాటతో, నటనతో ఎందరో సినీ కళాభిమానులు, ప్రజల హృదయాలను గెలుచుకున్న గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికు తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప గౌరవాన్ని ఇచ్చిందని సినీ నటుడు, కబడ్డీ కబడ్డీ ఫేమ్ సారిక రామచంద్ర రావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎస్పీ బాలు కుమారులు కోరిక మేరకు బాలు నివాసం ఉన్న నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో ఓ రోడ్డుకు బాల సుబ్రహ్మణ్యం పేరు పెట్టి ఆయన జయంతి రోజున ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని కొనియాడారు. బాలుతో తనకు మంచి పరిచయం ఉందన్నారు. తమ్ముడూ అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు.

డయల్ యువర్ డీఎంకు ఆరు ఫిర్యాదులు

నరసాపురం: డయల్‌యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికుల నుంచి ఆరు ఫిర్యాదులు అందినట్టు నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం నుంచి మచిలీపట్టణానికి కేవలం ప్యాసింజర్ సర్వీస్‌లే నడుస్తున్నాయని, కొన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు నడపాలని కోరారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ మధ్య సర్వీస్‌లు నడపాలని కోరినట్టు చెప్పారు. ప్రయాణికుల సలహాలు పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

పెనుగొండ: పెనుగొండలో ఓ లాడ్జిలో బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన దాడిలో పేకాడుతున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు పెనుగొండ ఎస్సై కే గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం రావడంతో పెనుగొండ గాంధీ బొమ్మల సమీపంలోని లాడ్జిపై దాడి నిర్వహించి, పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి వద్ద నుంచి రూ.40,340 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి


పాలకవర్గ సభ్యులతో సమావేశమైన ఈఓ అరుణ్ కుమార్

మొగల్తూరు: ఆలయ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని బండి ముత్యాలమ్మ దేవస్థానం ఈఓగా గురువారం బాధ్యతలు చేపట్టిన ఎం.అరుణ్ కుమార్ కోరారు. ఇప్పటి వరకు అమ్మవారి దేవస్థానం ఈఓగా విధులు నిర్వహించిన డి.రామకృష్ణంరాజు గునుపూడి సోమేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీ కావడంతో కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈఓగా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్‌ను ముత్యాలమ్మ దేవస్థానానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఈఓగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆలయ పాలకవర్గ సభ్యులతో సమావేశమయ్యారు. ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరుకు కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాల రావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ


రామన్నపాలెంలో ఎలుకల నివారణ మందును సిద్ధం చేస్తున్న సిబ్బంది

మొగల్తూరు: ఎలుకలు నివారణను సామూహికంగా పంట లేని సమయంలో చేపడితే వాటి సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చుని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. సామూహిక ఎలుకల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రామన్నపాలెం 2వ పచివాలయ పరిధిలో రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం లేని సమయంలో ఎలుకలుకు కావాల్సిన ఆహారం తక్కువగా ఉండడంతో ఎరను తినడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎలుకలు బతికి ఉన్న బొరియల్లో పది రోజులుకు ఒకసారి పైరు చిరు పొట్ట దశ వచ్చే వరకు ఎన్నిసార్లయినా బ్రోమోడయోలిన్ మందును వాడవచ్చున్నారు. ఈ సందర్భంగా సచివాలయం 2 పరిధిలోని రైతులకు నూకలు, నూనె, మందును కలిపిన పొట్లాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బందెల ఏలిషా, ఎంపీటీసీ సభ్యురాలు అయితం ధనలక్ష్మి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి

పాలకొల్లు అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చంటి పిల్లలకు అందిస్తున్న బాలామృతం సంజీవినిలా పనిచేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరం అంబేడ్కర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలు అవగాహన కల్పించారు. ఫోర్టిఫైడ్ మిల్క్‌ని గర్భవతులు, బాలింతలు వాడడం వల్ల ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. రక్తహీనత సమస్య తొలగిపోతుందన్నారు. బాలామృతం పిల్లలకు అందించడం వల్ల ఎదుగుదల, బరువు క్రమబద్ధీకరణ అవుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రాధ, రమణ, షేక్ సతార్‌బీబీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి షటిల్ పోటీలకు 15 మంది ఎంపిక


స్కూల్ గేమ్స్‌లో షటిల్ ఆడుతున్న విద్యార్థులు

యలమంచిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో పాలకొల్లు నియోజకవర్గ స్థాయి షటిల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు గురువారం స్థానిక తాళ్లూరి నారాయణస్వామి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోలాహలంగా నిర్వహించారు. బాలురు, బాలికలకు విడివిడిగా అండర్ 14, అండర్ 17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మూడు మండలాలతోపాటు పాలకొల్లు పట్టణం నుంచి సుమారు 50 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-14 బాలురు డబుల్స్‌లో ఎం.ర్యాన్ (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కలగంపూడి), డి.నిఖిల్ వర్మ (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కలగంపూడి) సింగిల్స్‌లో డి.నిఖిల్ వర్మ (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కలగంపూడి), కె.కిరీటి (బివిబి గ్రీన్ ఫీల్డ్, జున్నూరు) బి వర్షిత్ ఆదిత్య (బీవీబీ గ్రీన్ ఫీల్డ్, జున్నూరు) అండర్-17 బాలురు విభాగంలో ఎం.చరణ్ సూర్య (ఆదిత్య పబ్లిక్ స్కూల్), టి.వీరభద్ర శివ తేజ (చింతపర్రు జెడ్పీ హైస్కూల్), కె.సుధాకర్ (చింతపర్రు జెడ్పీ హైస్కూల్) అండర్-17 బాలికల విభాగంలో ఎం.సుజల (ఢిల్లీ పబ్లిక్ స్కూల్, కలగంపూడి, జి.ప్రియాంక (జెడ్పీ హైస్కూల్, లంకలకోడేరు), కె.గణేశ్వరి (జెడ్పీ హైస్కూల్, లంకలకోడేరు) అండర్-14 బాలికల విభాగంలో కె.అనన్యవర్మ (బీవీబీ గ్రీన్ ఫీల్డ్, జున్నూరు) ఎం.మోహనలక్ష్మి (బివిబి గ్రీన్ ఫీల్డ్, జున్నూరు) బి.వైష్ణవి (చించినాడ జెడ్పీ హైస్కూల్), కె.ఏంజిల్ (చించినాడ జెడ్పీ హైస్కూల్) మొత్తం 15 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఫెడరేషన్ పాలకొల్లు నియోజకవర్గ కార్యదర్శి రేలంగి రామకృష్ణ తెలిపారు. వీరంతా అక్టోబర్ 1న తణుకు పుల్లెల గోపిచంద్ అకాడమిలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వివరించారు. ఈ పోటీల నిర్వహణకు ఫెడరేషన్ యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాల కార్యదర్శులు యాండ్ర సత్యనారాయణ, వీరాస్వామి, శ్రీనివాస్ వ్యాయామోపాధ్యాయులు కె సురేష్, కె సత్యనారాయణ, కాసా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, బొంతు కల్యాణి, వినాయక్, భాస్కర్‌లు సహకారం అందించారు.

విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను గుర్తించాలి


పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ


పాలకొల్లు అర్బన్: ఆగర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థీ తమ తల్లిదండ్రులు పడే కష్టాలను తెలుసుకుంటే మన కోసం వాళ్లు ఎంత కష్టపడుతున్నారో? అర్థం అవుతుందని నరసాపురం డీఎస్పీ ఎస్ఎంబి మురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బేటి బచావో బేటీ పడావో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కొందరు విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేస్తుంటారని అలాంటి వారు ముఖ్యంగా వారి తల్లిదండ్రుల కష్టాలను తెలుసుకుంటే చదువు విలువ తెలుస్తుందన్నారు. నాకు చదువు లేదు నా పిల్లలైనా బాగుండాలనే పేద మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ఎంతో కష్టపడుతున్నారన్నారు. విద్యార్థులకు మంచి చెడు తెలుసుకునే వయస్సు విద్యార్థి దశేనని సూచించారు. చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు గురికావద్దని క్రమశిక్షణతో విద్యను పూర్తిచేసి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100, 109, 1098 వంటి హెల్ప్‌లైన్ నెంబర్లను గుర్తుంచుకోవాలని వాటి ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.రజనీకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ జి.ప్రమీల, మహిళా సాధికారత కన్వీనర్ బీకేవీ రామలక్ష్మి, పి.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్: ప్రతి విద్యార్థీ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు చెప్పారు. మండలంలోని ఆగర్రులో ఆడపిల్లను ఎదగనిద్దాం-ఆడపిల్లలను చదవనిద్దాం కార్యక్రమంపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ మహేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో మెలగాలని, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మంగ మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.ఆనందబాబు, ఏఎస్సై సత్యనారాయణమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ డి.కమల, హెచ్ఎం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

పెనుగొండ: ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐలో 2024 ఆగస్టులో జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తీర్ణులైన వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు, జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, పి.సుబ్రహ్మణ్యం, కె.కార్తీకేయ, వెంకటరెడ్డి, కళాశాల సూపరింటెండెంట్ జీఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు ప్రత్యేక పూజలు

కాళ్ల: కాళ్లకూరులో ఉన్న వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారికి యాగశాలార్చన, అగ్ని ప్రతిష్ట, కుంభావాహన, చక్రాబ్ది మండలార్చన, పవిత్రాధివాసం, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ రెడ్డి

పెనుగొండ: ప్రభుత్వ అందించిన ఇంటి స్థలాల్లో లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని పెనుగొండ మండల ఈఓపీఆర్‌డీ సీఎస్‌వీ రెడ్డి అన్నారు. గురువారం వడలి పంచాయతీ వద్ద జిల్లా కలెక్టరు ఆదేశాలతో నిర్వహించిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయని వారు, జనవరి 2025 లోపు పూర్తి చేసే విధంగా ప్రోత్సహించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే బిల్లులు సకాలంలో వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈ పీఆర్ ఏడుకొండలు, కార్యదర్శి పీపీ రామకృష్ణ, వి.మోనికా రంగ, ఉప్పలపాటి చంటి, ఉప సర్పంచ్ వలపన నరేష్, మేకా శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛతా హీ సేవ

వడలి పంచాయతీ ఆవరణలో గురువారం స్వచ్ఛతా హీసేవ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయ లక్ష్మీ పెద్దిరాజు, ఉప సర్పంచ్ వలపన నరేష్, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్‌గా ఉంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగు అవుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

భీమవరం: పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు అన్ని రకాల పెండింగ్ బకాయిలను ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు గాతల జేమ్స్ డిమాండ్ చేశారు. గురువారం భీమవరంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పీఆర్సీ కమిటీని నియమించి ఇంటీరీయం రిలీఫ్ (ఆర్ఐ) ప్రకటించాలని, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పాత రేట్లలో అమలు చేయాలని, కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ మినహాయింపు 11 సంవత్సరాలకే పరిమితం చేయాలని, ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేది లేని వారికి నమోదు చేయాలన్నారు. స్టేట్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ బాబ్జి మాట్లాడుతూ పెన్షనర్స్‌కు అన్ని రకాల సేవలను ఎస్‌బీఐలో సేవా భావంతో చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగిరాజు నారాయణ రాజు, కోశాధికారి బీవీ రవిప్రసాద్ ప్రవేశపెట్టిన నివేదికలను కార్యవర్గం ఆమోదించింది. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాగిరాజు నారాయణరాజు, సహాధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌రాజు, ఎస్ఎస్ఎస్ పాల్, సూర్యనారాయణ, కె.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

పాలకోడేరు: అమ్మాయిలు ఒంటరిగా బయట తిరగొద్దని, అవసరమైనప్పుడు గుంపులు గుంపులుగా వెళ్లాలని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కె.లలిత ఉద్బోధించారు. గురువారం విస్సాకోడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థినులతో ముచ్చటిస్తూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్స్ చట్టం, లైంగిక వేధింపులు, స్త్రీల హెల్ప్‌లైన్ గురించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు మొదలగు వాటిని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కుమారి, హెల్త్ విజిటర్ నాగమణి, ఏఎన్ఎంలు హేమకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.